# దోమరసం

**- గరిమెళ్ళ నాగేశ్వరరావు**

**ఆదివారం, టీ.వీలో వారఫలాలు చూస్తున్నాను. "డాడీ మీకోసం... కామరాజు అంకుల్ వచ్చారు" అంటూ బాబిగాడు కేకేసి, క్రికెట్ బ్యాట్ తీసుకు బయటికి వెళ్ళిపోయాడు.**

"దా.. రాజూ... ఇలా లోనికొచ్చెయ్.." అంటూ కామరాజుని లోపలికి ఆహ్వానించి కుర్చీ చూపించాను.

ఇద్దరం కల్సి కాఫీలు తాగుతూ వారఫలాలు చూడడం పూర్తయ్యాక "ఆc...రోజూ ఏంటి సంగతులు.. చెప్పు..." అన్నాను.

"ఏం లేదు బావా... నీతో ఒక స్కీమ్ గురించి మాట్లాడదామని వచ్చాను." కాఫీ కప్పు కింద పెడుతూ అసలు విషయానికొచ్చాడు కామరాజు.

కామరాజు 'స్కీమ్' అన్నాడంటే అది స్కామ్‌కన్నా పెద్దదే.

"బోలెడన్ని ప్రయోగాలు 'బోల్డు'గా చేసేసి బోలెడు డబ్బులు సంపాదించాలి అనేది కామరాజు జీవితాశయం అంటూ బాల్డ్ హెడ్‌ని గోక్కుంటూ చాలాసార్లు చెప్పేవాడు.

"సరే ఆ స్కీమేంటో... చెప్పు మరి" అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

"బావా... ఇప్పటివరకూ చరిత్రలో.. ఎన్ని ప్రయోగాలు చేస్తున్నా నివారణలు వెదుకుతున్నా.. అరికట్టలేనివి రెండున్నాయ్.. ఒకటి ప్రేమకాటు రెండోది దోమకాటు. ఈ రెండింటి మీదా ఆధారపడి కోట్లు కూడబెట్టిన వాళ్ళూ ఉన్నారు. వీటి కాట్లు తిని కాటికి చేరిన వాళ్ళూ ఉన్నారు.

"ప్రేమ కాటుమీద ప్రయోగాలు చెయ్యడానికి టీ.వీల వాళ్ళూ, సినిమాల వాళ్ళూ పాట్లు పడుతున్నారు. నేను దాని జోలికి పోను.. నా స్కీముకి ప్రాణం "దోమకాటే" అన్నాడు కామరాజు ఆవేశంగా.

"దోమకాటు మీద స్కీమా.. నీకేమైనా పిచ్చెక్కిందా రాజూ" అంటూ అతడి ఆవేశానికి అడ్డు తగిలాను మధ్యలో.

"విన్నప్పుడు మొదట్లో అలాగే అనిపిస్తుంది. వివరాలన్నీ చెప్పాక ఇదో అద్భుతమైన ఆలోచన అని నువ్వే ఒప్పుకుంటావ్" అంటూ సర్దిచెప్పాడు కామరాజు.


ఇక తప్పదన్నట్టు "సరే.. చెప్పు".. అన్నాను అప్పుడే చేతి మీద వాలి రక్తం పీల్చేస్తున్న దోమని.. కసిగా కొట్టి చంపేస్తూ..

"బావా.. బజార్లో చూడు దోమలకి సంబంధించి ఎన్ని ఉత్పత్తులున్నాయో.. క్రీములూ, మేట్లూ, కోయిల్సూ, లోషన్సూ.. తెరలూ.. అబ్బో కోట్ల మీద జరుగుతోంది దోమకాట్ల వ్యాపారం" అన్నాడు కళ్ళు తిప్పుతూ కామరాజు.

"మరి నేను చెప్పేదీ.. అదే.. ఇప్పటికే ఇన్నుండగా, మళ్ళీ కొత్తగా నువ్వు చేసేదేంటీ.. అని" ఇప్పటికి నా దారికొచ్చావ్ అనుకొంటూ ఆనందంగా అడిగాన్నేను.

దానికి సమాధానంగా..

"ఎవరి స్కీమ్.. వాళ్ళదీ.. నేను కనిపెట్టింది సరికొత్త ఫార్ములా దీనికి తిరుగుండదు.. దీనిపేరు "దోమరసం". మొన్న ఇంట్లో పాత చెత్తనంతా సవరిస్తోన్నప్పుడు



పురాతన గ్రంథంలోంచి తొంగి చూసిన ఫార్ములా ఇది. కడుపులోనికి తీసుకునే టానిక్కు లాంటిది. రెండు చెమ్చాల దోమ రసం గ్లాసుడు నీళ్ళలో కలిపి లోపలికి తీసుకొంటే శరీరం నుండి ఒక రకమైన రసాయనపు వాసన వస్తుందట.. ఆ వాసనకి.. దోమలన్నీ పరార్.."

పెద్ద శాస్త్రవేత్తలా ఫోజు పెడుతూ చెప్పుకుపోతున్నాడు కామరాజు. అతడి మాటలకి మరోసారి అడ్డుతగులుతూ...

"అసలే కడుపులోనికి తీసుకునేదంటున్నావ్.. ఫార్ములా వికటించి ప్రాణాలమీదికొచ్చిందంటే... నిన్ను జైల్లోకి తోస్తారు. పెళ్ళాం, పిల్లలూ అనవసరంగా అన్యాయమైపోతారు. ఇలాంటి పాడు ఆలోచనలు మానుకో" అంటూ హితవు చెప్పాను.

దానికి.. కామరాజు అటూ ఇటూ చూసి, గొంతు చిన్నది చేసి "బావా.. ఫార్ములా నీక్కాబట్టి చెప్పేస్తున్నాను.. ఇందులో పెద్ద ప్రమాదం ఏదీ లేదు.. కొంచెం ధనియాలూ, జీలకర్రా, అల్లం, వెల్లుల్లి, కొత్తిమీరీ, వేపాకు.. కసాబిసా కలిపి నూరేసి, మిక్సీలో వేసి తిప్పేసి అరగంటపాటు ఆవిరులొచ్చేవరకూ మరిగించి చల్లార్చితే.. అదే.. "దోమరసం" అంటూ రహస్యం మొత్తం చెప్పేశాడు. రాజు "ఓరి నాయనో.. వీడేదో పెద్ద ప్లాను మీదే ఉన్నాడు" అనుకొని.

"ఐడియా సరే గానీ, అది పనిచేస్తుందో లేదో తెలిసేదెలా..? దానిమీద జనానికి నమ్మకం కుదిరేదెలా... దాన్ని మార్కెట్ చెయ్యడం కూడా మరీ అంత సులువేం.. కాదు.. అస్సలీ తలనొప్పంతా అవసరమా.. రాజూ.." అంటూ అనుమానంగా అడిగాను.

అంతా విని చిరునవ్వు నవ్వుతూ.. "బావా నువ్వింకా పాత కాలంలో ఉన్నావు.. అందుకే నీకు అంత భయం.. మనం ఉన్నది ప్రచార యుగంలో.. కొంచెం బుర్ర ఉపయోగించి, ప్రచారం, పథకం ప్రకారం సాగిస్తే.. పందిని కూడా నంది చేసి నమ్మించేయొచ్చు.. అదే నా ధైర్యం" అన్నాడు రాజు.

"ఏమో.. నాకైతే.. అంతా అయోమయంగా ఉంది.. నువ్వు అనవసరంగా సాహసం చేసి చేతులు కాల్చుకుంటున్నావనిపిస్తోంది.." ఒకంతట ఒప్పుకోని మనసుని సముదాయించలేక నిజాన్ని చెప్పేశాను.

రాజు, తన ప్రయోగానికి ప్రచారం.. నన్ను ఒప్పించడంతోటే మొదలు పెడదాం అనుకున్నట్టుంది.. అందుకే ఏమాత్రం చెక్కుచెదరని చిరునవ్వుతో తిరిగి చెప్పటం మొదలుపెట్టాడు.

"బావా నీకు రామన్ పిళ్ళై.. గుర్తున్నాడా? ఆకుపసరు లోంచి ఆయిల్ తీస్తానంటూ.. హడావుడి చేశాడు. ఎంతమంది దాన్ని ఖండించారో.. అంతమంది.. అందులో ఎంతోకొంత నిజం ఉండే ఉంటుందంటూ అతగాడిని వెనకేసుకొచ్చారు.

"ఆయిల్ పుల్లింగ్ అంటూ మరొకరెవరో.. వ్యాసాలు రాస్తే.. జనం తెల్లారేసరికి డబ్బాలు, డబ్బాలు కొద్దీ నూనెని, నోరు నొప్పి పుట్టేదాకా పుక్కిలించి.. దేశమంతా ఉమ్మి పొయ్యలేదూ..?

టీ.వీ. పెట్టేసరికి.. ఈ బెల్టు వాడితే అరగంటలో పొట్ట మాయం.. మా రంగురాళ్ళు రింగులో పొదిగితే తల రాత తారుమారు.. అంటూ.. ఎన్ని ప్రకటనలు.. వీటిలో పనిచేసేవి ఎన్ని?

చెయ్యనివి ఎన్ని? వాటితో పోలిస్తే.. మన దోమరసం.. సూపర్ హిట్టవుతుంది.. ఏమంటావ్?" అన్నాడు ఆయాసం ఆపుకుంటూ కామరాజు.

మొదట్లో ఏమో అనుకున్నాను గానీ, పోనుపోనూ.. ముందుకెళుతూంటే.. నేనే.. కన్విన్స్ అయిపోతున్నాను.. నేను ఒక మెట్టు దిగినట్టు కనబడేసరికి

కామరాజు తిరిగి రెచ్చిపోవడం మొదలుపెట్టాడు.

"బావా..ప్రచారమే మనకి ప్రాణం.. పవర్‌తో పని లేదు.. సరుకు ఎంత చెత్తదైనా.. ప్రకటనలు ఆకర్షణీయంగా ఉంటే.. ఏదోలా అమ్మేసుకోవచ్చు.. జనం ఘాడ నమ్మకం లేదా మూఢ నమ్మకం. వీటిలో ఒకటి మన వ్యాపారానికి అవసరం. మొదటిది ప్రయత్నం చేసి చూస్తా.. ఫలించకపోతే.. రెండోది ప్రచారం చేస్తా".. అంటూ తన వ్యాపార రహస్యాల గుట్టువిప్పాడు రాజు.

"ఇంతకీ ప్రచారానికి నువ్వు వేసుకున్న ప్రణాళికైనా ఫలిస్తుందా మరి"అంటూ మరో సందేహం వెలిబుచ్చాను.

నా పట్టు సడలుతోన్నకొద్దీ, అతడిలో ఉత్సాహం.. అధికమౌతుంది గ్లాసుడు మంచినీళ్ళు తాగి మళ్ళీ మొదలుపెట్టాడు.

"నాకు తెలిసున్న సినిమా హీరో ఒకతను ఉన్నాడు, రెండు, మూడు ఛానెళ్ళవాళ్ళు, వ్యాపారం పుంజుకునే దాకా... చౌకగా ప్రకటనలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మాజీ ప్రముఖులు కొందరు.. మన దోమ రసానికి మద్దతుగా.. పత్రికలలో వ్యాసాలు రాస్తామన్నారు.. ఇలా తలో చేయీ తోడైతే.. మనముందు పేడ అయినా బంగారంలా పోదూ.." అన్నాడు కొండంత నమ్మకంతో.

కామరాజు ఆత్మవిశ్వాసం.. అప్పటికే నా చేతులు దాటిపోయింది ఇంక చేసేదేం లేదన్నట్టు "సరే.. నీకు అంత ధైర్యమున్నాక ఇంకేమీ ఆలోచించకు.. "దోమ రసం" తయారీ ప్రారంభించెయ్.. మరి".. అన్నాను.

* * *

ఆరోజు అలా మాటల్లో ప్రారంభమైన పథకం.. కామరాజు కార్యదీక్షతో.. భలే ఊపందుకుంది. "దోమ రసం" వార్త సాయంత్రం పూట దోమల్లా వాడవాడలకీ చేరి మార్మోగిపోతోంది కొద్ది రోజుల్లోనే కామరాజు పేరు కూడా "దోమరాజు"గా మారిపోయింది.

వ్యాపారానికి నెమ్మదిగా సెంటిమెంటుని కలగలిపి, సూటిగా ఇళ్ళల్లో గృహిణుల మీదకి గురిపెట్టాడు, కామరాజు. "కేచ్ దెమ్ ఎట్ హోమ్" అనేది కామరాజు వ్యాపారానికి ట్రేడ్ సీక్రెట్‌గా మారింది.

"ప్రేమ పుట్టకుండా ఎవ్వరూ ఆపలేరు..
దోమ కుట్టకుండా మేము ఆపగలం."
"దోమ రసం.. దోమ రసం..
రోజూ గ్రుక్కెడు తాగేసాం..
దోమలన్నిటిని తరిమేశాం.."

ఏ ఛానెల్ చూసినా.. ఇదే ప్రకటన.. దోమల ఝుంకారంలా రొదపెడుతోంది. చూస్తుండగానే దోమ రసం భలే పాపులర్ అయిపోయింది.

లక్కీ డీప్‌లూ, ఫారిన్ ట్రిప్‌లూ లాంటి కొత్త.. కొత్త స్కీములని "దోమ రసానికి" జత చేసేసరికి మందు పవర్ గురించి మరిచిపోయి మరీ.. సీసాలు.. సీసాలు కొనేస్తున్నారు.. జనం.

పలు పత్రికలలో "దోమ రసం" ప్రాముఖ్యత మీద వ్యాసాలు అచ్చవుతున్నాయ్.. ఒక రోజు ఉదయాన్నే, నేను టీ.వీ. ఆన్‌చేసేసరికి తెర మీద కామరాజు ప్రత్యక్షమయ్యాడు. షాక్ నుండి తేరుకొని ఆసక్తితో చూద్దును కదా..

"ప్రముఖ ఆయుర్వేద నిపుణులు దోమరాజుగారితో పరిచయం"అంటూ కార్యక్రమం మొదలయ్యింది.

"దోమ రసం" గురించి సందేహాలు అడిగేవాళ్ళు నేరుగా రాజుగారితో మాట్లాడొచ్చును.. అంటూ స్క్రోలింగ్‌లో ఒక నెంబర్ పరిగెడుతోంది. "వీడు మామూలోడుకాదు" అనుకొంటూ టీ.వీ. తెరకి అతుక్కుపోయాను నేను.

ఇంతలో రాజమండ్రి నుండి ఒకామె ఫోన్‌లో తన ప్రశ్న మొదలుపెట్టింది "దోమరాజుగారూ.. మీ మందు వేసుకొని మొన్న గార్డెన్‌లో కూర్చొన్నాను అయినా దోమలు అదే పనిగా.. కసి.. కసిగా.. కసా.. బిసా.. కుట్టేసాయ్.. అంటే మీ మందు పనిచేయనట్టే కదా.." అని ఆమె అడిగింది.

"చిక్కాడు కామరాజుగాడు.. ఇంక అయిపోయాడు..



వ్యాపారానికి నెమ్మదిగా సెంటిమెంటుని కలగలిపి, సూటిగా ఇళ్ళల్లో గృహిణుల మీదకి గురిపెట్టాడు, కామరాజు. "కేచ్ దెమ్ ఎట్ హోమ్" అనేది కామరాజు వ్యాపారానికి ట్రేడ్ సీక్రెట్‌గా మారింది.

ఇప్పుడు ఏం చెప్తాడో చూద్దాం" అనుకొంటూ టీ.వీలో వాడి ముఖం వేపు తీక్షణంగా చూశాను.

కామరాజు అస్సలెక్కడా తొణకలేదు.. బెణకలేదు.. అదో రకం ప్రశాంతతని ముఖానికి పులుముకొని, ముసి ముసిగా నవ్వుతూ.. తిరిగి ఆమెతో.. "చూడండమ్మా.. గార్డెన్‌లో కూర్చోవడానికి ముందు మీరేం తిన్నారు"? అని అడిగాడు

దానికి.. ఆమె.. కాస్సేపు ఆలోచించి.. "ఉల్లిపాయ పకోడీలు తిన్నానండీ" అంది.

వెంటనే తడుముకోకుండా కామరాజు.. "ఆ.. అక్కడే చిక్కొచ్చింది. దోమ రసానికి ఉల్లిపాయ విరుగుడు లాంటిది.. అది మందు శక్తిని హరించి వాసనని మార్చేస్తుంది.. ఈసారి దోమ రసం వాడేటప్పుడు.. ఉల్లిపాయలు తినకండి" అన్నాడు నమ్మకంగా.. బుకాయిస్తూ.

"వీడి మందుకి.. పథ్యాలు కూడానా.. వీడినాదేముడే రక్షించాలి" అని నాలో నేనే గొణుక్కున్నాను.

దోమ రసానికి శాస్త్రీయ ఆధారం లేదనీ, దానిని నిషేధించాలనీ పెద్ద దుమారం లేవదీశారు.. ఎవరో..

దీనికి విరుగుడుగా "దోమరసం" ప్రాణాలను కాపాడిందంటూ పలువురిచేత పత్రికా ప్రకటనలు ఫొటోలతో సహ గుప్పించాడు, కామరాజు. అంతేకాదు. ఫార్ములాకోసం ఫారిన్ కంపెనీలు ఎగబడుతున్నాయంటూ వార్తలు పుట్టించాడు.

మొత్తంమీద "దోమరసం" ఒక సంచలన వార్తయ్యి కూర్చుంది.

దోమరాజుకి అభిమానులూ, వ్యతిరేకులూ ఏర్పడి కొత్త గుర్తింపొచ్చింది. చందాలూ, విరాళాలూ విరివిగా ప్రకటిస్తూండడం.. పలువురికి పురస్కారాలని ప్రదానం చెయ్యడం లాంటి సేవా కార్యక్రమాలని.. తన వ్యాపారానికి కవచం చేసుకుని.. నాలుగురాళ్ళు వెనకేసుకొంటున్నాడు.

"నామీద, దోమ రసం, మీద విశ్వాసం ఉన్నవాళ్ళు దీనిని కొనుక్కోండి.. లేనివాళ్ళు వదిలిపెట్టండి.." అన్న నినాదంతో.. వివాదాలకి తెర దింపి వ్యాపారాన్ని వెలగబెడుతున్నాడు.. వాడు.

కొత్తగా పుట్టుకొచ్చిన పార్టీ తరపున ఎన్నికలలో పోటీ చేయడానికి కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నాడని విన్నాను. కామరాజు విజయం సంగతి ఎలా ఉన్నా నా కాపురంలో కొత్త చిచ్చు రగులుకుంది.. నెమ్మదిగా ఇంటిపోరు మొదలయ్యింది.. ఒక రోజు నా శ్రీమతి.. ముక్కు చీదుతూ..

"ఆ కామరాజుగారిని చూడండి.. ఏ.సీ. కార్లూ, బంగ్లా.. రేపో, మాపో మంత్రి కూడా అయిపోవచ్చు.. మీరూ ఉన్నారు. ఎందుకూ? చిన్నప్పట్నుండీ నేను క్లాసులో ఫస్టు.. కామరాజువి మాత్రం అత్తెసరు మార్కులు, అనేవారు.. ఆయన పదో తరగతి పరీక్షలు కూడా.. మీ దగ్గర కాపీకొట్టే పాసయ్యారని గప్పాలు కొడతారు.. కానీ ఆయనెక్కడ మీరెక్కడ" అంటూ సాధించడం ఎక్కువైపోయింది. "కనీసం రెండు సీసాల దోమ రసాన్ని.. కొనండి.. లక్కీ డిప్‌లో సింగపూర్ ట్రిప్ తగలొచ్చు"అంటూ వేధించడం నాకు తలనొప్పిని తెచ్చాయ్.

ఒక ఆదివారం ఉదయాన్నే కళ్ళు నులుముకుంటూ టీ.వీ. ఆన్‌చేసేసరికి.. నాకు గుండె ఆగినంతపనయ్యింది.. వార్తలు చదువుతూ న్యూస్ రీడర్.

"ప్రముఖ వ్యాపారవేత్త దోమరాజుగారు సెరిబ్రల్ మలేరియా సోకి.. నిన్న రాత్రి కన్నుమూసారు.. దోమల నివారణకోసం దోమరసాన్ని కనిపెట్టిన దోమరాజుగారు.. దోమకాటుకే గురయ్యి.. గుటుక్కుమనడం ఒక విషాదం.." అన్నది ఆ వార్త సారాంశం.

ఆ వార్త విని తట్టుకోలేక, నేను అయ్యో కామరాజూ.. కామరాజూ.. అంటూ గట్టిగా అరుస్తున్నాను.

ఇంతలో నా శ్రీమతి తడి చేయి చెంపలకి తగిలేసరికి నాకు నిద్ర నుండి మెలకువ వచ్చింది.

"ఏంటండీ.. రాత్రంతా పవర్‌కట్‌వల్ల దోమలు కుట్టేసి సరిగా నిద్ర పట్టలేదంటూ.. అటూ ఇటూ దొర్లి తెల్లవారుఝామునే.. గురకలోకి జారుకున్నారు. ఎందుకులే మీ నిద్రని పాడుచెయ్యడం అని లేపలేదు.. ఇప్పుడు టైం ఎనిమిదయ్యింది.. ఇక లెండి.. కలేదో వచ్చినట్టుంది.. కేకలేస్తున్నారు." అంటూ నవ్వుతోంది.

"అయితే.. ఇదంతా కలన్నమాట.. ఏమో.. ఇప్పటి పరిస్థితుల్లో నిజం అయినా అయిపోవచ్చు" అనుకొంటూ టూత్‌బ్రష్ తీసుకొని బాత్రూమ్‌లోకి దూరాను. "కామరాజెలా ఉన్నాడో.. కాస్సేపయ్యాక ఫోన్ చెయ్యాలి" అనుకొంటూ దంతధావనం మొదలుపెట్టాను!

★

రచయిత చిరునామా:
గరిమెళ్ళ నాగేశ్వరరావు,
జవహర్ నవోదయ విద్యాలయ,
కొమ్మాది, విశాఖపట్నం- 48.